క్లుప్తంగా

ఓటుతో బుద్ధి చెప్పాలి

మన్ననూర్: బంగారు తెలంగాణ అంటూ అప్పుల తెలంగాణగా మార్చిన కల్వకుంట్ల కుటుంబానికి ఓటు ద్వారా తగిన గుణపాఠం చెప్పాలని విశ్రాంత ఉద్యోగుల రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం స్థానిక హరిత హోటల్ వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎంతో మంది త్యాగాల ఫలితంగా వచ్చిన ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో కల్వకుంట్ల కుటుంబం, మంత్రులు, ఎమ్మెల్యేలు వారి బంధవులు మాత్రమే బాగుపడ్డారని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో ప్రస్తుత బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దింపాలని ఆయన పిలుపునిచ్చారు. అంతకు ముందు విశ్రాంత ఉద్యోగుల సంఘం, ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర నాయకులు వెంకటరమణ, రవీంద్ర గుప్తాలు వెంకటేశ్వర్లును సన్మానించారు.

ఆర్టీసీలో ప్రయాణం సురక్షితం



చారకొండ: ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితమని దేవరకొండ డిపో మేనేజర్ రాజీవ్ కుమార్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న ప్రయాణికులతో ఆయన మాట్లాడారు. బస్సులు సమయానికి వస్తున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించకుండా ఆర్టీసీని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో బస్సు డ్రైవర్లు, ప్రయాణికులు ఉన్నారు.

అల్పాహారం ప్రారంభంతో సత్ఫలితాలు



తాడూరు: ప్రభుత్వ పాఠశాలలో అల్పాహారం ప్రారంభించడంతో విద్యార్థుల హాజరు సంఖ్య మెరుగ్గా ఉందని ఎంఈఓ భాస్కర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని అల్లాపూర్‌లో అల్పాహారం పథకాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ డ్రాప్ అవుట్ అయిన విద్యార్థులు తిరిగి పాఠశాలలో చేరుతున్నారన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు శ్రీనివాస్ రెడ్డి, ఆనంద్, సాయిప్రభ, విద్యార్థులు ఉన్నారు.

ఎక్సైజ్ అధికారుల దాడి



పెంట్లవెల్లి: మండలంలోని జటప్రోల్, పెంట్లవెల్లి గ్రామాల్లో శుక్రవారం కొల్లాపూర్ ఎక్సైజ్ ఎస్‌ఐ శంకర్ సిబ్బందితో కలిసి పలు బెల్టు దుకాణాలు, దాబాలలో తనిఖీలు నిర్వహించారు. మొత్తం 11 లీటర్ల సారా, 11 లీటర్ల లిక్కర్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. అనుమతులు లేకుండా మద్యం విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

సారా పట్టివేత: కేసు నమోదు

ఉప్పునుంతల: మండలంలోని కాంసానిపల్లి తండాకు చెందిన మూడావత్ బుజ్జి అనే మహిళ శుక్రవారం సార తరలిస్తూ పట్టుబడినట్లు హెడ్‌కానిస్టేబుల్ మల్లయ్య తెలిపారు. ఆమె వద్ద నుంచి 10 లీటర్లు సారాను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

తిరుమలలో భజన మండలి సభ్యులు



లింగాల: మండలంలోని అంబట్‌పల్లికి చెందిన రామాంజనేయ భజన మండలి సభ్యులు మూడు రోజుల కిందట తిరుమల తిరుపతికి తరలివెళ్లారు. శుక్రవారం తిరుమలలోని అఖండ హరినామ సంకీర్తనంలో పాల్గొని భక్తిగీతాలను ఆలపించారు. భజన బృందం చంద్రగౌడు, రామకృష్ణ, జంగయ్య, శ్రీశైలం, వెంకటేష్, నాగేష్, అచ్చలు, వీరయ్య, శశికుమార్, నీరంజన్‌రెడ్డి, నరేందర్, లింగస్వామి, రమేష్, మహేష్, అఖిల్ పాల్గొన్నారు.

అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి పనిచేస్తా

కల్వకుర్తిరూరల్: అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి పనిచేస్తానని టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ యాదిలాల్ అన్నారు. శుక్రవారం పట్టణంలో నిర్వహించిన ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో పోటీ చేయడం లేదని పేర్కొన్నారు. చిన్నయ్య, కృష్ణయ్య, వజ్రలింగం, సతీష్ ఉన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు



తాడూరులో వాహనాలను తనిఖీ చేస్తున్న సిబ్బంది

తాడూరు: అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా పోలీసులు ముమ్మరంగా వాహనాల తనిఖీ చేపడుతున్నారు. శుక్రవారం కేంద్ర బలగాలు, స్థానిక పోలీసులు కార్లు, ద్విచక్రవాహనాలు నిలిపి తనిఖీ చేశారు. వాహనాలకు సంబంధించిన పూర్తి వివరాలను నమోదు చేస్తున్నట్లు తనిఖీ అధికారి శ్రీనివాసులు తెలిపారు.

భారీ వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలి

బిజినేపల్లి: జిల్లా వ్యాప్తంగా అంతర్రాష్ట్ర సరిహద్దుల నుంచి వచ్చే భారీ వాహనాలు, కంటైనర్లు, ఇతర వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని కేంద్ర వ్యయ పరిశీలకుడు బేరా రామ చౌదరి సూచించారు. శుక్రవారం వీసీ హాల్లో జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ ఉదయ్‌కుమార్ జిల్లా నోడల్ అధికారులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వాహనాలలో డబ్బు, మద్యం, వస్తువులు తరలించే అవకాశం ఉందన్నారు. ప్రతి రషీదును, ట్యాక్స్ పేపర్లు, బిల్లులు వంటి వాటిని తప్పకుండా పరిశీలించాలన్నారు. అధికారులు ఉదాసీనత వైఖరి వీడాలన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఎన్నికల ఫిర్యాదులపై తక్షణమే స్పందించి పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో జీఎస్టీ, ఐటీ, ఎంసీసీ, సోషల్ మీడియా తదితర విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

మూడోసారి ఆశీర్వదించండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మర్రిజనార్దన్‌రెడ్డి

తెలకపల్లి: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మూడోసారి ఎమ్మెల్యేగా ఆశీర్వదించాలని నాగర్‌కర్నూల్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మర్రి జనార్దన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కార్వంగ, చిన్నముద్దునూరు, జమిస్తాపూర్, నడిగడ్డ, గౌరారం గ్రామాల్లో ఆయన ప్రచారం నిర్వహించారు. సందర్భంగా ఎమ్మెల్యే మర్రిజనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యేగా నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తూ సొంత డబ్బులతో పేదలను సేవ కార్యక్రమాల ద్వారా ఆదుకున్నానన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ విజయనిర్మల, సర్పంచ్ శ్రీధర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు బైకాని శ్రీనివాస్‌యాదవ్, మండల అధ్యక్షుడు ఈదుల నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

బీఎంపీతోనే బహుజనుల సంక్షేమం



తాడూరు: బహుముక్తి పార్టీతోనే బహుజనుల సంక్షేమం సాధ్యమని ఆ పార్టీ నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే అభ్యర్థి విజయ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో కూలీలతో కలిసి ఆయన ప్రచారాన్ని ప్రారంభించారు. మంచం గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. పేదలకు సేవకుడిలా పనిచేస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటస్వామి, పరుషరాం, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఊపందుకున్న ఎన్నికల ప్రచారం



కొల్లాపూర్‌లో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి తల్లి బిచ్చమ్మ



పెనిమిళ్లలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

లింగాల: అచ్చంపేట బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజుకు మద్దతుగా ఆపార్టీ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం మండలంలోని అప్పాయపల్లిలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అంతకుముందు ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నీలవేణి, ఎంపీటీసీ కాశీనాథం, మాజీ ఎంపీపీ మంజుల, మాజీ ఉప సర్పంచ్ పర్వతాలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డికి మద్దతుగా..

కొల్లాపూర్: బీఆర్‌ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డికి మద్దతుగా ఆయన తల్లి బీరం బిచ్చమ్మ శుక్రవారం పట్టణంలోని 12వ వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. మరోసారి తన కుమారుడిని గెలిపించాలని అభ్యర్థించారు. ఆమె వెంట స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు ఎల్లగౌడ్, వడ్డె కురుమూర్తి, గోవు రాజు, భాషా తదితరులున్నారు.

ఉప్పునుంతల: మండల కేంద్రంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి వంశీకృష్ణకు మద్దతుగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కట్టా అనంతరెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అదేవిధంగా బీఆర్‌ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే గువ్వల బాలరాజుకు మద్దతుగా నాయకులు కట్టా గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఓటర్లను కలిశారు. మండలంలోని పెనిమిళ్ల, వెల్టూరు, తాడూరు గ్రామాల్లో ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు ఓటర్లను కలిసి ఓటు వేయాలని అభ్యర్థించారు.

బీఎస్పీతో సమాన హక్కులు



తెలకపల్లి: బహుజన్ సమాజ్ పార్టీతోనే అందరికి సమాన హక్కులు అందుతాయని నాగర్‌కర్నూల్ బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి కొత్తపల్లి కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని పర్వతాపూర్‌లో ఆయన ప్రచారాన్ని ప్రారంభించారు. అనంతరం నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి ఏనుగు గుర్తుకు ఓటు వేసి బీఎస్పీని బలపర్చాలని ఓటర్లకు సూచించారు. కార్యక్రమంలో రెడ్డపాకు శివశంకర్, శివ, పృథ్వీరాజు, హర్ష, కల్యాణ్, సందీప్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

కందనూలు క్రీడాకారుల ప్రతిభ



షీల్డ్ అందుకుంటున్న కందనూలు విద్యార్థులు

కందనూలు: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న అండర్–14 ఖోఖో టోర్నమెంట్‌లో శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన బాలికలు ప్రతిభ కనబర్చి ద్వితీయస్థానంలో నిలిచారు. గద్వాల జిల్లా పాతపాలెం జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో జరిగిన టోర్నమెంట్‌లో వనపర్తి జిల్లా, నాగర్‌కర్నూల్ జిల్లా విద్యార్థులు ఖోఖో విభాగంలో తలపడ్డాయి. నాగర్‌కర్నూల్ జట్టు రెండోస్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా డీఈవో గోవిందరాజులు, జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి పాండు వారిని అభినందించారు. కార్యక్రమంలో ప్రసాద్‌గౌడ్, ఉపాధ్యాయులు వెంకటయ్య, ప్రకాష్, పురంచంద్ రమేష్, సత్యనారాయణ, లక్ష్మి ఉన్నారు.

రాహుల్ రాకతో పాలకులకు గుబులు

వెల్దండ: ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ రాకతో అధికార పార్టీ ప్రజాప్రతినిధులకు, నాయకులకు గుండెల్లో రైలు పరుగెడుతున్నాయని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోతీలాల్‌నాయక్ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాహుల్‌గాంధీ కల్వకుర్తి సభకు రావడంతో పార్టీ కార్యకర్తల్లో జోష్ కనిపిస్తుందోన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమావ్యక్తం చేశారు. అనంతరం మండలంలోని బొల్లంపల్లి గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ యాదగిరితో పాటు కొంత మంది నాయకులు మోతీలాల్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వెంకట్ రెడ్డి, డైరెక్టర్ మట్ట వెంకటయ్యగౌడ్, నరేష్, పత్యనాయక్, నాయకులు పర్వత్‌రెడ్డి, పుల్లయ్య, శంకర్ నాయక్, రాజు, రామస్వామి, గోపాల్‌నాయక్, చందర్, గోపాల్, తదితరులు ఉన్నారు.

అభ్యర్థుల గెలుపులో కార్యకర్తలే కీలకం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

వెల్దండ: బీఆర్‌ఎస్ అభ్యర్థులు విజయం సాధించాలంటే కార్యకర్తలే కీలకమని ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం రాఘయపల్లిలో మండల ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. కార్యకర్తలు పనిచేయడంతోనే నిజమైన లబ్ధిదారులకు సంక్షేమపథకాలు అందాయని కొనియాడారు. సీఎం కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రిని చేద్దామని పిలుపునిచ్చారు. ఈనెల 5న ఆమనగల్లులో నిర్వహించే సమావేశానికి మంత్రి కేటీఆర్ హాజరవుతారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన వెంకటయ్య ఎన్నికల ప్రచారం కోసం ఎమ్మెల్యేకు రూ.50వేలు విరాళం అందజేశారు. అనంతరం వివిధ గ్రామాలకు చెందిన పలు పార్టీల కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో రాష్ట్రపుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీటీసీ విజితారెడ్డి, నాయకులు రాంరెడ్డి, వెంకట్‌రెడ్డి, గోపాల్‌నాయక్, జైపాల్‌నాయక్, వెంకటయ్యగౌడ్, నాగులునాయక్, శేఖర్‌ముదిరాజ్, ఆయా సర్పంచ్‌లు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

కల్వకుర్తి: ఎమ్మెల్యే జైపాల్ యాదవ్‌ను అఖండ మెజారిటీతో గెలిపించుకుని గులాబీ జెండా ఎగురవేద్దామని మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం పిలుపునిచ్చారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలోని 11, 12 వార్డుల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు ముగిసే వరకు ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని కోరారు. అనంతరం పలు పార్టీల చెందిన నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ షాహెద్, మాజీ చైర్మన్ శ్రీశైలం, కౌన్సిలర్లు కిషోర్‌రెడ్డి, బోజి రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జనార్దన్‌రెడ్డి, యాదగిరి, వెంకటేష్, మాధవరెడ్డి, పరమేష్, హరిదాస్, తదితరులు పాల్గొన్నారు.

మోసపూరిత హామీలు నమ్మొద్దు

పెంట్లవెల్లి: బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇస్తున్న మోసపూరిత హామీలు నమ్మొద్దని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహయాదవ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పదేళ్లుగా ప్రజలను మాయమాటలతో కాలం వెళ్లదీశారని ఆరోపించారు. జూపల్లి కృష్ణారావు భారీ మెజారిటీతో గెలుపొందుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నర్సింహయాదవ్, సర్పంచ్ గోపినాయక్, మాజీ సర్పంచ్ కోట్లసురేందర్, రామన్‌గౌడ్, నరేష్, వెంకటయ్యలు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతోనే రోగాలు దూరం



శాగాపూర్‌లో పైపులైన్ల లీకేజీ నీటిని పరిశీలిస్తున్న ఏఎన్‌ఎం సుమిత్ర

పాన్‌గల్: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే రోగాలకు దూరంగా ఉండొచ్చని శాగాపూర్ ఏఎన్‌ఎం సుమిత్ర అన్నారు. శుక్రవారం డ్రై డేలో భాగంగా మండలంలోని శాగాపూర్‌లోని పలు కాలనీల్లో పర్యటించి పరిసరాల శుభ్రత, కీటకజనిత వ్యాధుల నివారణపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. వారానికి ఒక్కసారి నిల్వ నీటిని పారబోసి నూతన నీటిని పట్టుకోవాలని సూచించారు. పలు కాలనీల్లో తాగు నీటి పైపులైన్ల లీకేజీలు ఉన్నాయని, వాటిని మరమ్మతు చేపట్టాలని ఆమె సర్పంచ్‌ను కోరారు. వ్యాధులు సంభవిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. నిల్వ నీటిలో దోమల లార్వాను నిర్మూలించుటకు అబ్బేట్ ద్రావణాన్ని కలిపినట్లు ఆమె పేర్కొన్నారు.

తండాలను పంచాయతీలుగా చేసిన ఘనత బీఆర్‌ఎస్‌దే

కొల్లాపూర్ రూరల్: తండాలను పంచాయతీలుగా చేసిన ఘనత బీఆర్‌ఎస్‌దేనని ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని బోడబండ తండా, సున్నపుతండా, వడ్డెర గుడిసెలు, అంజనగిరి, ఎర్రగట్టు, బొల్లారం తదితర తండాల ప్రజలతో కలిసి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తండాలు అభివృద్ధి చెందాలంటే బీఆర్‌ఎస్‌కు గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కార్యకర్తలు, ప్రజలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

'ఎమ్మెల్యే నుంచి రక్షణ కల్పించాలి'



మాట్లాడుతున్న మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ మహిమూదాబేగం

కొల్లాపూర్: ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి, ఆయన అనుచరుల నుంచి తమకు రక్షణ కల్పించాలని కొల్లాపూర్ మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ మైమూదా బేగం, ఆమె భర్త ఖాదర్‌పాషా కోరారు. శుక్రవారం వారు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పార్టీ మారామనే అక్కసుతో తమపై ఎమ్మెల్యే అనుచరులు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారన్నారు. చౌటబెట్ల శివారులోని 104 సర్వే నెంబర్ గల భూమిని చట్టప్రకారం కొనుగోలు చేశామని ఆ భూమిలో ప్లాట్లు కొనుగోలు చేసిన వారికి వేరే స్థలంలో ప్లాట్లు చూపించామన్నారు. ఎస్‌ఐ బాలవెంకటరమణ తమపై ఉద్దేశపూర్వకంగా తప్పుడు కేసులు నమోదు చేస్తున్నారని వారు ఆరోపించారు. కాంగ్రెస్ నాయకులు మేకల నాగరాజు మాట్లాడుతూ భూకబ్జాలకు పాల్పడుతున్నది ఎమ్మెల్యే హర్షవర్ధన్ రెడ్డేనన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు బాలస్వామి, నయూమ్, సారంగి వెంకటేశ్వర్లు, కర్ణాకర్ తదితరులున్నారు.

కొనసాగుతున్న చేరికల పర్వం



తాడూరు మండలం యాదిరెడ్డిపల్లిలో కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ కార్యకర్తలు



పెద్ద కొత్తపల్లిలో ఎమ్మెల్యే బీరం సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన జొన్నలబొగుడ కాంగ్రెస్ కార్యకర్తలు

చారకొండ: మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ ఎంపీటీసీ గ్యార లక్ష్మణ్‌తో పాటు నాయకులు, కార్యకర్తలు శుక్రవారం 40 మంది అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్ అభ్యర్థి వంశీకృష్ణ సమక్షంలో హైదరాబాద్‌లో కాంగ్రెస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారిలో గుండె శివ, సత్యం, తావు, లలిత, కొండల్, అనిల్, నరేష్, కిరణ్, నర్సింహ్మా, బాలస్వామి, కాశయ్య, యువకులు ఉన్నారు. మండల అధ్యక్షుడు బాల్‌రాంగౌడ్ నాయకులు ఉన్నారు.

లింగాల: మానాజీపేట, వల్లభాపూర్, రాంపూర్ చెందిన పలువురు బీఆర్‌ఎస్ కార్యకర్తలు మాజీ ఎమ్మెల్యే వంశీకృష్ణ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. అనంతరం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బాగ్యాబాయి, ఉప సర్పంచ్ ధర్మారెడ్డి, మండల అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, నాయకులు నారాయణగౌడ్, లక్ష్మణ్‌నాయక్, విజయలక్ష్మి, పాల్గొన్నారు.

తాడూరు: మండలంలోని యాదిరెడ్డిపల్లిలో మాజీ సర్పంచ్ చిన్నారెడ్డి, చెన్నపురెడ్డి, ప్రాంతీస్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి సమక్షంలో 200 పైగా బీఆర్‌ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. అదేవిధంగా మండలంలోని చర్లతిరుమలాపురంలో 50 మందికి పైగా బీఆర్‌ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు.

బీఆర్‌ఎస్‌లోకి

పెద్దకొత్తపల్లి: జొన్నల బొగుడ గ్రామానికి చెందిన 20 మంది కాంగ్రెస్ కార్యకర్తలు శుక్రవారం మండల కేంద్రంలో ఎమ్మెల్యే బీరంహర్షవర్ధన్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను చూసి ఇతర పార్టీల కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఇందిరారవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలోకి..



బీజేపీలో చేరిన చిన్నకొత్తపల్లి గ్రామస్తులు

మండలంలోని చిన్నకొత్తపల్లి గ్రామానికి చెందిన వివిధ పార్టీలకు చెందిన పలువురు కార్యకర్తలు బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు సమక్షంలో బీజేపీలో చేరారు. శుక్రవారం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎల్లేని సుధాకర్‌రావు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఇతర పార్టీల నాయకులు బీజేపీలో చేరుతున్నారన్నారు. కార్యక్రమంలో సిద్దార్థ, శివుడు పాల్గొన్నారు.

బీజేపీ అధికారంలోకి వస్తే బీసీ ముఖ్యమంత్రి



బీజేపీలో చేరిన వారితో తల్లోజు ఆచారి

కల్వకుర్తిరూరల్: బీజేపీ అధికారంలోకి వస్తే బీసీ ముఖ్యమంత్రి అవుతారని కల్వకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి తల్లోజు ఆచారి అన్నారు. శుక్రవారం పట్టణంలోని సీకేఆర్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మున్సిపాలిటీ, మండలంలోని పలు గ్రామాలకు చెందిన యువకులు పెద్ద సంఖ్యలో ఆచారీ సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతతోనే మార్పు సాధ్యమన్నారు. కొత్తగా యువత అధికసంఖ్యలో ఓటర్లుగా నమోదు చేసుకోవడం సంతోషకరమన్నారు. ఒక్కసారి తనకు అవకాశం ఇస్తే సేవకుడిగా పనిచేస్తానన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, హోంమంత్రి అమిత్‌షాలు ప్రకటించిన విధంగా రాష్ట్రంలో వెనకబడిన వర్గాలకు చెందిన వ్యక్తి ముఖ్యమంత్రి కావాలంటే అది బీజేపీతోనే సాధ్యం అన్నారు. 40 సంవత్సరాల ఒకే పార్టీలో ఉంటూ ఇతర పార్టీల నాయకులు ఎన్ని ప్రలోభాలకు గురిచేసినా పార్టీ మారలేదన్నారు. కార్యక్రమంలో కృష్ణగౌడ్, శేఖర్‌రెడ్డి, నర్సిరెడ్డి, నర్సింహా, అభిలాష్‌రెడ్డి, దుర్గాప్రసాద్, రాఘవేందర్‌గౌడ్, నిరంజన్‌గౌడ్, శేఖర్‌రెడ్డి, నరేష్ గౌడ్, చందు ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

చారకొండ: కల్వకుర్తి ఎమ్మెల్యేగా గెలిపిస్తే నియోజకవర్గ అభివృదిద్ధికి కృషి చేస్తానని బీజేపీ అభ్యర్థి తల్లోజు ఆచారి అన్నారు. శుక్రవారం మండలంలోని గోకారం, చంద్రాయన్‌పల్లి, జూపల్లి గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం తిరిగి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను వివరించారు. వెంకట్ గౌడ్, కొండల్ గౌడ్, శేఖర్ రెడ్డి, విజేందర్ రెడ్డి, పర్వతాలు, తిరుపతి, అంజి, కార్తీక్ తదితరులు ఉన్నారు.

అభివృద్ధి చేసి చూపిస్తా



గోలగుండంలో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి రాజేష్‌రెడ్డి

తెలకపల్లి: ఒక్కసారి ఎమ్మెల్యేగా గెలిపిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానని నాగర్‌కర్నూల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం గడప గడపకు కాంగ్రెస్‌లో భాగంగా మండలంలోని గోలంగుండంలో ఆయన ప్రచారం నిర్వహించారు. ఆరు గ్యారంటీ పథకాలపై అవగాహన కల్పించారు. పేదలకు అండగా ఉంటానని అన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు సుమిత్ర, రోహిణి, సింగిల్ వైస్ చైర్మన్ మామిళ్లపల్లి యాదయ్య, మాజీ ఎంపీపీ బండ పర్వతాలు, సీనియర్ నాయకులు గుగ్గిల్ల ప్రకాష్, వంశవర్ధన్‌రావు, ఎంపీటీసీ ఈశ్వరయ్య, సైదులు, రామస్వామి, మల్లేష్, ఆనంద్ పాల్గొన్నారు.

నాసిరకం విత్తనాలు విక్రయిస్తే చర్యలు



రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

బిజినేపల్లి: రైతులకు నాసిరక విత్తనాలు, ఎరువులు, మందులు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని ఏడీఏ రమేష్‌బాబు, ఏవో నీతి హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలోని పలు వ్యవసాయ దుకాణాలను వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను తనిఖీ చేశారు. అదేవిధంగా మండల కేంద్రంలో నిర్వహిస్తున్న రైతు ఆగ్రో సేవా కేంద్రాలను సందర్శించి తనిఖీ చేశారు.

50 మందికి తగ్గొద్దు

పాన్‌గల్: మండలంలో నిర్వహిస్తున్న ఉపాధి పనులకు ప్రతి గ్రామంలో 50 మందికి తగ్గకుండా కూలీలు వచ్చేలా ఆయా గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లు కృషి చేయాలని ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పోలింగ్ కేంద్రంలో ఎన్నికల నిబంధనల మేరకు అన్ని వసతులు కల్పించాలని, నర్సరీల్లో నూతన మొక్కల పెంపకానికి అవసరమైన కవర్లు, మట్టిని సిద్ధం చేసుకోవాలన్నారు. సిబ్బంది ఎన్నికల నిబంధనలకు లోబడి విధులు నిర్వహించాలన్నారు. ఎంపీఓ రఘురాములు, ఏపీఓ కుర్మయ్య పాల్గొన్నారు.